
# నిజం

**- ఎన్.ఎన్.రెడ్డి**



ఉగాది పోటీలో ఎంపికైన కథ

*ఉదయం **10** గంటల సమయం!*

*తిరుపతి అలిపిరి సమీపంలో ఆర్టీసి బస్సు ఆటోను గుద్దడంతో ఓ వ్యక్తి చనిపోయాడు. ఆటోఅతను ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. చనిపోయిన వ్యక్తి వివరాలకోసం గాలించిన పోలీసులకు అతని జేబులోని పాకెట్ డైరీ ద్వారా వివరాలు తెలిశాయి.*

*ఏలుమలై, **102**, చర్చిగేట్, చెన్నై!*

*కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాడీని పోస్ట్ మార్టంకోసం రుయా హాస్పిటల్‌కు తరలించారు.*

***

ఉదయం 11 గంటలు సమయం!

సడన్‌గా స్టేషన్ ముందు ఆగిన ఆటోవైపు చూడ సాగాడు సెంట్రీ!

ఓ నడివయస్కుడు ఆటో దిగి సూట్‌కేసుతో సహా స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్నాడు. అతన్ని ఆపి.

ఏమయ్యా...ఏం కావాలి? అనడిగాడు సెంట్రీ.

"ఎస్ఐ గారు కావాలి!" అతని సమాధానం.

"ఎందుకు?"

"అది ఆయనతోనే చెప్పాలి. ముఖ్యమైన పని!"

"అలాగా! అదేంటో నాకు చెప్తేనే చేసిపెట్టగలనుగా! ఏదైనా పాత బాకీ వసూలులో ఇబ్బందా! లేక ఎవరైనా యింటిమీద దౌర్జన్యం చేసారా? నో ప్రాబ్లం సమస్య ఏదైనా సరే!"

"అది కాదండి!"

ఏది కాదండి ఆ? చూడు మా ఎస్.ఐ గారి పేరు తెలుసా? వసూల్‌రావు పేరుకు తగ్గట్టు ప్రవర్తిస్తాడు.

అదే నేననుకో ఓ హాఫ్ బాటిల్ మందు, చికెన్ బిర్యాని మహా అంటే ఆపై అయిదొందలు అంతే నీ పని ఫినిష్ చేస్తా!

"నాకే సమస్యా లేదు, నన్ను స్టేషన్‌లోకి వెళ్ళనివ్వండి!"

"కారణం లేనిదే కొట్లాడ రాదు. తేల్చుకోలేని సమస్య లేనిదే ఏ మనిషీ పోలీస్‌స్టేషన్‌కు రాడు. ఆలోచించుకో నేను చెప్పేది నీ జేబు జాగ్రత్తకే కదా!"

అయినా అతను వినకపోవడంతో ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు? అంటూ ముఖం తిప్పుకున్నాడు సెంట్రీ! లోనికెళ్తూనే అతనికి హెడ్ కానిస్టేబుల్ తగిలాడు. హలో... హలో... బాబూ ఏంటి కథ? పర్మిషన్ లేకుండా అలా సరాసరి ఎస్.ఐ గారి రూంకెళ్ళడానికి ఇది చేపల మార్కెట్టో, సూపర్ మార్కెట్టో కాదు. ఇది పోలీస్‌స్టేషన్ ఇక్కడ కొన్ని పద్ధతులుంటాయి అంటూ ఆపాడు హెడ్ వచ్చిన విషయం వివరించాడు అతడు.

"సరే... సూట్‌కేసులో ఏముంది? బాంబా... డబ్బా?!"

"తెలీదండీ?"

"అరే నీ చేతిలోని సూట్‌కేసులో ఏముందో తెలీదా? ఇదేదో కొత్త కేసు లాగుందే, సరే ఆగు అంటూ ఎస్.ఐ. రూంలోనికెళ్ళిన అతను అయిదు నిమిషాల తర్వాత తిరిగొచ్చి నువ్వు ఎస్.ఐగార్ని కలవచ్చయ్యా వెళ్ళు! అన్నాడు" తాపీగా.

***

"నమస్తే సార్!"

"నమస్తే రండి కూర్చోండి!... మర్యాదగా అన్నాడు ఎస్.ఐ."

"ఈ సూట్ కేసు...!"

"ముందు మీరెవరు? ఏం చేస్తుంటారో చెప్పి మరీ ఈ సూట్‌కేసు గురించి వివరంగా చెప్పండి?"

అతని మాటలు పూర్తికాకమునుపే అడ్డుతగులుతూ అన్నాడు ఎస్.ఐ.

"అలాగే సార్! నా పేరు శర్మ ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో నాకో చిన్న హోటల్‌వుంది!"

ఈ ఉదయం దాదాపు తొమ్మిది గంటల ప్రాంతంలో మా హోటల్‌కి ఒక కష్టమర్ వచ్చి రెండిడ్లీ, పూరీ తిని వెళ్ళాడు. అతను వెళ్ళిన అర గంట తరువాత మా సర్వర్ వచ్చి "ఇందాక వచ్చిన కష్టమర్ ఈ సూట్ కేసు మరచిపోయాడు" అంటూ నాకు ఇచ్చాడు.

ఒకవేళ తిరిగి వస్తాడేమోనని ఇంతవరకు ఎదురు చూసాము. కానీ రాలేదు ఏం చెయ్యాలో తోచక ఇలా మీ దగ్గరకొచ్చాను. ఇదే అతను మరచిపోయిన సూట్‌కేసు అంటూ సూట్ కేసును ఎస్.ఐ. టేబుల్ మీద పెట్టాడు శర్మ.

ఇంతకీ ఏముంది ఇందులో?

తెలియదు సార్! లాక్ చేసుంది. తెరవాలంటే భయంవేసి ఆ ప్రయత్నం చేయలేదు.

అరే నూటమూడు! ఎస్.ఐగారు కేకవేశారు.

"సార్"అంటూ! నూటమూడు వచ్చాడు.

అతని డ్రస్ వంక చూసాడు శర్మ.

షణ్ముగం అని అతని యూనీఫాంకు నేమ్ ప్లేట్ వుంది.

ఏం నూటమూడు అని పిలవకపోతే "షణ్ముగం"అని పిలవచ్చుగా అని మనసులోనే అనుకున్నాడు శర్మ.

ఆ... అదే... సూట్‌కేసులు తెరచే ఆ మతలబు గాడ్ని తీసుకురా!

అలాగే సార్! అంటూ అతనెళ్ళిపోయాడు.

ఇరవై నిముషాల తర్వాత మతలబు రావడం... ఏవేవో నెంబర్లు తిప్పి అర గంట తర్వాత సూట్‌కేసు తెరవడమూ జరిగింది.

తెరిచిన సూట్‌కేసులో కొన్ని నోట్ల కట్టలుండటంతో ఆశ్చర్యపోయారు అందరూ!

అక్షరాలా అరవై వేలు! శర్మ సమక్షంలోనే నోట్లు లెక్క పెట్టి చెప్పాడు ఎస్.ఐ, తలూపాడు శర్మ.

డబ్బుతోపాటు ఆ సూట్ కేసులో ఓ పర్సనల్ కార్డు కన్పించింది. ఏలుమలై, 102, చర్చిగేటు, చెన్నై ఫోన్. 5713766, "ఓకే శర్మా! అతగాడి అడ్రస్ ఇందులో వుంది. ఫోన్ చేసి పిలిపించి నీ సమక్షంలోనే అతనికి డబ్బిస్తాం... అవునూ, అతను తిరిగొస్తే మీరు కాని మీ సర్వర్‌గాని గుర్తుపట్టగలరా?"

"ఎలా సార్! రోజుకు ఎంతోమంది కష్టమర్లు వస్తుంటారు, వెళ్తుంటారు. అందర్నీ గుర్తుపట్టడం కష్టం. కష్టమర్లకి మాకు ఉన్న బంధం, బిల్లు... డబ్బు అంతే అంత కన్నా ఏం ఉండదు!

అతని అడ్రస్ ఎలాగూ ఉంది కాబట్టి ఇబ్బందేం ఉంది?

"బాగా చెప్పావయ్యా! ఇక నువ్వెళ్ళవచ్చు. నీ హోటల్ టెలిఫోన్ నెం. ఇవ్వు రాగానే నిన్నూ పిలిపిస్తాం. ఎస్.ఐ. గారు అలా అన్నాక తన ఫోన్ నెంబరిచ్చి నిష్క్రమించాడు శర్మ.

శర్మ వెళ్ళగానే హెడ్ కానిస్టేబుల్‌ను తన రూంకు పిలిపించి, తలుపులు మూసేసి పది నిమిషాలు మంతనాలు జరిపాడు ఎస్.ఐ.

సరేనని తలూపి వెళ్ళిపోయాడు హెడ్!

అసలు కథ ఆరంభానికి ప్రారంభోత్సవం జరుపుకుంది గుట్టుగా!

***

ఏ కార్యానికైనా కాస్త విరామం కావాలిగా... అందుకే వారం తర్వాత... శర్మ హోటల్లో కౌంటర్ మీద ఫోన్ మోగుతోంది.

"హలో... నేను వన్‌టౌన్ ఎస్.ఐ. మాట్లాడుతున్నాను శర్మగారున్నారా?

"ఆ... ఆ... నమస్తే సర్ నేను శర్మనే మాట్లాడుతున్నాను చెప్పండి!"

ఆ మిష్టర్ శర్మా! గత వారం మీ హోటల్లో డబ్బు అదేనయ్యా సూట్ కేసును మరచిపోయిన చెన్నై నివాసి మిష్టర్ ఏలుమలైని పిలిపించాం. ప్రస్తుతం అతను మా స్టేషన్లో ఉన్నారు. మీరు త్వరగా వస్తే మీ సమక్షంలో అతనికి సూట్‌కేసు ఇవ్వడం జరుగుతుంది!

"అలాగే సార్ సంతోషం మరో పది నిముషాల్లో మీముందుంటాను! అని ఫోన్ పెట్టేసి, తను వచ్చేవరకు హోటల్ జాగ్రత్త అని నమ్మకమైన వారికి చెప్పి బయలుదేరాడు శర్మ.

"రండి... రండి... మీ కోసమే ఎదురుచూస్తున్నాం అన్నాడు ఎస్.ఐ. లోనికి వస్తున్న శర్మను చూసి ఆ తర్వాత ఏలుమలై వైపు చూస్తూ మళ్ళీ తనే "ఇతనే ఏలుమలై"అని శర్మకు పరిచయం చేస్తూ అతన్ని కూడా ఏలుమలైకి పరిచయం చేసాడు.

రొంబ థ్యాంక్స్ సర్! శర్మను అభినందిస్తూ ఏలుమలై అన్నాడు.

అబ్బే పర్వాలేదండి. నాకంతగా తమిళం రాదు. మనిషిని మనిషి దోచుకోవడం మానవత్వం అనిపించుకోదు. తరిగిపోతున్న మానవ సంబంధాల్ని తిరిగి మనం సాధించుకోవాలి.

ఆ తర్వాత ఓ పది నిమిషాలు అంతా మాట్లాడుకున్నారు.

"హెడ్!" ఎస్.ఐ.గారి కేక.

"సర్!"

మరి "ఆ టీవీ' విలేకర్ని, ఫొటోగ్రాఫర్ని పిలువు!

వారు లోనికొచ్చారు. మిగతా స్టాఫ్ అంతా బ్యాక్‌గ్రౌండ్ సీన్లో అందరి సమక్షంలో ఆ సూట్‌కేసును తెరచి డబ్బును హైలెట్ చేస్తూ శర్మ, ఎస్.ఐల చేతుల మీదుగా ఏలుమలైకి ఇవ్వడం, కెమెరా క్లిక్‌మనడం, ఆ తర్వాత చిన్న ఇంటర్వ్యూతో ముగిసిందాసీను.

తన జేబులోనుండి వెయ్యి రూపాయల కాగితం తీసి శర్మకు అందిస్తూ ఇది నా తృప్తికోసం! అన్నాడు ఏలుమలై.

వద్దండి!

పరవాఇల్లయా వెచ్చుకో!

అందరూ చప్పట్లు మోతలు మోగించారు.

శర్మ వెళ్ళిపోయాడు తృప్తిగా.

***

'ఇది నీకురా నీయబ్బా! అసలైన తమిళుడిలా తయారై వచ్చావు. శెభాష్ ఇదిగో తీసుకో రెండువేలు డూప్లికేట్ ఏలుమలైని అభినందిస్తూ అన్నాడు ఎస్.ఐ!

'సార్! ఇది మరీ అన్యాయం? మీ ఎదురుగానే శర్మకు వెయ్యిచ్చాను. నేను వేసుకున్న ఈ తమిళ డ్రస్సుకి అద్దె వంద, ఇక నాకు మిగిలిందేముంది ముష్టి తొమ్మిదొందలు తప్ప?' మడత పెట్టాడు డూప్లికేట్.

"సరే సరే నీ డబ్బు ఏడుపు ఆపు!"

"దారుణం సార్! మీరు కొట్టేసింది మాత్రం అరవై వేలు. ప్రతిసారి మీరు చెప్పినట్టే చేస్తున్నానుగా! నాకు మాత్రం వేరే ఉద్యోగం ఏముంది?"

"చంపేస్తున్నావురా! ఆ అరవై వేలలో మీకూ పంచుతున్నాగా, మళ్ళీ ఎందుకు ఆ ఏడుపు? సరే ఇదిగో మరో రెండువేలు అఘోరించు ఏం? ఆ. అన్నట్లు షరతులు తెలుసుగా ఎక్కడన్నా నోరు జారావో... టాడా కేసులో తోసేస్తా భడవా!"

"మీ సంగతి నాకు తెలుసుకదా సార్? అంటూ డూప్లికేట్ వెళ్ళిపోయాడు. మతలబు వచ్చాడు.

"ఇదోరా అయిదొందలు."

"కొంచెం పెంచండి. సార్?"

"ఏరా నకరాలు చేస్తున్నావా?"

"అబ్బే లేదు లేదు సార్ ఇదే చాలు! భయం భయంగా వెనుదిరిగాడతను.

"హెడ్!"

"సర్!"

ఆ మిష్టర్ శర్మా! గత వారం మీ హోటల్లో డబ్బు అదేనయ్యా సూట్ కేసును మరచిపోయిన చెన్నై నివాసి మిష్టర్ ఏలుమలైని పిలిపించాం. ప్రస్తుతం అతను మా స్టేషన్లో ఉన్నారు. మీరు త్వరగా వస్తే మీ సమక్షంలో అతనికి సూట్‌కేసు ఇవ్వడం జరుగుతుంది!

"ఇదిగో నీకో పదివేలు. అలాగే ఈ అయిదువేలు స్టేషన్లోని మిగతా వారికి పంచు."

అలాగే సార్!

పంపకాలు పూర్తయ్యాయి అవినీతి సాక్షిగా, ఒక మరణం సాక్షిగా!

పెన్నుపేపరు తీసుకుని లెక్కలు రాయసాగాడు ఎస్.ఐ.

అందరికీ పంచాక దాదాపుగా నలభై వేల వరకు మిగిలాయి.

ఫోన్ అందుకుని తన ఇంటికి ఫోన్ చేసాడు.

"హలో శాంతీ పోయిననెల్లో రెండు పేట్ల బంగారు చైన్ కావాలన్నావుగా? ఈరోజే కొందాం సాయంత్రం తొందరగా వస్తాను రెడీగా వుండు షాపింగ్‌కి వెళ్దాం!"అని ఫోన్ పెట్టేశాడు.

***

మరుసటిరోజు ఉదయం న్యూస్ పేపర్లో జిల్లా ఎడిషన్లో మొదటి పేజీలో...

"బస్సు... ఆటో ఢీ ఒకరి మృతి" క్యాప్షన్లో సీన్ ఇన్‌సైడులో ఏలుమలై ఫొటో అదే పేజీలో చివరలో...

"హోటల్ యజమాని నిజాయితీ" అన్న శీర్షికతో ఫొటో వివరాలు.

రెండు వార్తల్ని తరచి తరచి చూడసాగాడు క్రైం పోలీస్ హెడ్.

అంతే హుటాహుటిన వన్‌టౌన్‌కు బయలుదేరాడు.

నిజాయితీగా డ్యూటీకో... లేక రావలసిన వాటాకో!

★

